సాక్షి జనగామ

సోమవారం । 28 । ఆగస్టు । 2023



వెయ్యేళ్లనాటి వరదపాశం బండ

రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామంలో వెయ్యేళ్లనాటి వరదపాశం బండను చరిత్రకారులు గుర్తించారు. - 8లో▸



బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి

బీఆర్‌ఎస్‌ను మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి ఎర్రబెల్లి అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $33^0/23^0$

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉండి, రాత్రి ఆహ్లాదకరంగా మారుతుంది.

న్యూస్‌రీల్‌

నేటి గ్రీవెన్స్‌ వాయిదా

జనగామ రూరల్‌: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు కలెక్టర్‌ శివలింగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకుర్తిలోని వల్మిడిలో సెప్టెంబర్‌ 4న ముఖ్యమంత్రి కేసీఆర్‌ పర్యటన ఉండడంతోపాటు, స్పెషల్‌ సమ్మరీ రివిజన్‌ ఓటరు నమోదు కార్యక్రమం ఉన్నందున వాయిదా వేసినట్లు వెల్లడించారు.

'కార్మిక బంధు' అమలు చేయాలి



తరిగొప్పుల: దళిత బంధు, బీసీ బంధు తరహాలో భవన నిర్మాణ కార్మికులకు కార్మిక బంధు అమలుచేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మండల అధ్యక్షుడు ఎర్రవెల్లి పోషయ్య అధ్యక్షతన ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. లేబర్‌ కార్డు పునరుద్ధరణకు వేలిముద్ర పద్ధతిని తొలగించి, పాత పద్ధతిలోనే కార్డు పునరుద్ధరణ చేపట్టాలని కోరారు. కార్మికుడు సహజ మరణం పొందితే రూ.5లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10లక్షలు మంజూరు చేయాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతీ కార్మికుడికి రూ.5,000 ఫించన్‌ అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో పాకాల స్వామి, చింతల సురేష్‌బాబు, మేర్గొజు రామాచారి, ప్రభాకర్‌, వెంకట్‌, ఉప్పలయ్య, కిష్టయ్య, నర్సయ్య, రమేష్‌, సారయ్య, సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు అవకాశం ఇవ్వాలి



బచ్చన్నపేట: జనగామ ఎమ్మెల్యే టికెట్‌ను బీఆర్‌ఎస్‌ పార్టీ నుంచి స్థానికులకు అవకాశం కల్పించాలని మాజీ జెడ్పీటీసీ, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు జల్లి సిద్దయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969 నుంచి పోరాటాల్లో పాల్గొన్నానని, విద్యార్థి దశలోనే రెండు వారాల పాటు జైలు జీవితాన్ని అనుభవించినట్లు తెలిపారు. మద్దూరు జెడ్పీటీసీగా అధిక మెజార్టీతో గెలుపొంది అనేక అభివృద్ధి పనులు చేశానన్నారు. అలాగే నియోజకవర్గంలో అధిక సంఖ్యలో బీసీలు ఉన్నారని, బీసీ అభ్యర్థికి టికెట్‌ ఇస్తే ఎమ్మెల్యేగా గెలిపిస్తారని అన్నారు. ఈ విషయమై సీఎం కేసీఆర్‌ను కలిసి వినతి పత్రాన్ని ఇవ్వగా ఈ విషయాన్ని పరిశీలిస్తామని ప్రజలు అభీష్టం మేరకు టికెట్‌ను కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అడ్వకేట్లు పానుగంటి శ్రీనివాస్‌, ఆరేళ్ల భాస్కర్‌, నక్క సిద్దులు, నాయకులు గర్దాస్‌ వెంకటేశ్వర్లు, ఆరేళ్ల హరిబాబు పాల్గొన్నారు.

నోటిఫికేషన్‌కు ముందే వాల్‌రైటింగ్‌ జోరు



కొడకండ్ల: ఎన్నికల నోటిఫికేషన్‌ వెలువడక ముందే బీఆర్‌ఎస్‌ అభ్యర్థి వాల్‌రైటింగ్స్‌ మొదలయ్యాయి. బీఆర్‌ఎస్‌ పార్టీ ముందుండి అభ్యర్థులను ప్రకటించగా పాలకుర్తి నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుని బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా సీఎం కేసీఆర్‌ ప్రకటించారు. దీంతో ప్రత్యర్థి పార్టీలకంటే ముందే వాల్‌రైటింగ్స్‌తో దూసుకెళ్తున్నాడు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం, మంత్రి దయాకర్‌రావు అభివృద్ధి పనులను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఆకర్షణీయంగా వాల్‌ రైటింగ్స్‌ వేయిస్తున్నారు. ప్రత్యర్థి పార్టీల అభ్యర్థుల ఎంపిక ఇంకా పూర్తి కాకపోగా, బీఆర్‌ఎస్‌ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసుకొన్న మంత్రి ఎర్రబెల్లి వాల్‌రైటింగ్స్‌లో ముందుండడం గమనార్హం.

అంచనాలు తలకిందులు

పత్తి తక్కువ.. వరి 'సరాసరి'

- మూడొంతులు తగ్గిన కందులు
- చివరి దశకు వానాకాలం పంటల సాగు
- వెదజల్లే పద్ధతిలో వరి సాగుకు అవకాశం
- కొనసాగుతున్న పంటల నమోదు

వానాకాలం సీజన్‌ పంటల సాగుపై వ్యవసాయ శాఖ అంచనాలు తలకిందులయ్యాయి. అకాల వర్షాలతో యాసంగి సీజన్‌లో భారీగా నష్టపోయిన రైతులపై.. వానాకాలం సాగు సమయంలో ఆగకుండా కురిసిన వర్షాలు తీవ్ర ప్రభావం చూపాయి. వరి, పత్తి పంటలు తగ్గడానికి వరదలు కారణమయ్యాయి. ఈ సీజన్‌లో పత్తి, మొక్కజొన్న సాగు పూర్తి కాగా.. వెదజల్లే పద్ధతిలో వరి సాగుచేసుకునే అవకాశం సెప్టెంబర్‌ మొదటి వారం వరకు ఉంది.

– జనగామ

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 3.75 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, కందులు, ఇతర పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ ముందస్తు అంచనాలు సిద్ధం చేసింది. యాసంగి సీజన్‌ మొదట్లో వర్షాభావ పరిస్థితులు.. కోత దశలో వడగళ్లు, అకాల వర్షాలతో 55వేల ఎకరాలకు పైగా వరి, సుమారు 10వేల ఎకరాల్లో మామిడి, ఇతర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. రైతులకు రెక్కల కష్టం కూడా మిగలని పరిస్థితుల్లో ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తామని ప్రకటించింది. జిల్లాలో జరిగిన నష్టంపై వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదికలు పంపించినా.. పరిహారం చెల్లింపు ఆలస్యం కావడంతో సన్న, చిన్నకారు రైతులు వానాకాలం పంటల పెట్టుబడికి మరోసారి అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో చాలా మంది రైతులు ఈసారి సాగు మానుకున్నారు. కొందరు కౌలుకు ఇచ్చారు.

40 శాతం తగ్గిన పంటల సాగు

జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌ 3.75లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేయగా.. ఇప్పటి వరకు 2.85 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు వేశారు. పత్తి 1.70 లక్షల ఎకరాలకు 1.36 లక్షల ఎకరాలు, వరి 1.90 లక్షల ఎకరాలకు 1.72 లక్షల ఎకరాలకు తగ్గిపోయింది. వరి వెదజల్లే పద్ధతిలో సెప్టెంబర్‌ మొదటి వారం వరకు సాగు చేసుకునే అవకాశం ఉంది. కందులు(రెడ్‌గ్రామ్‌) 10వేల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా.. 3,500 ఎకరాల్లో సాగైంది. పత్తి, మొక్కజొన్న సాగు సమయం ముగియగా.. వరికి మరో 13 రోజుల సమయం ఉండడంతో.. 35వేల ఎకరాలకు పెరగ వచ్చని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఇక ఇతర పంటలు(మొక్కజొన్న, పెసర, కూరగాయలు) 5వేల ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేయగా.. 12,163 ఎకరాలకు పెరిగింది.

ఆర్‌ఎన్‌ఆర్‌–15048 సాగుకు అవకాశం

జిల్లాలో ఆర్‌ఎన్‌ఆర్‌–15048 రకం(120 రోజుల పంట) వరి సెప్టెంబర్‌ మొదటి వారం వరకు గింజలను వెదజల్లే పద్ధతిలో సాగు చేసుకోవచ్చని వరి వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. గత ఏడాది ఇదే సీజన్‌లో వరి 2.10లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, ఈసారి 18వేల ఎకరాలు వెనుకబడింది. గడిచిన 10 రోజులుగా ఎండలు దంచికొడుతూ ఉష్ణోగ్రతలు పెరగడంతో చాలా చోట్ల వరి సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పటల నమోదు చేస్తూనే రైతులకు సాగుపై అవగాహన కల్పిస్తున్నారు.



జిల్లాలో వరి సాగు

జిల్లాలో వానాకాలం పంటల సాగు వివరాలు(ఎకరాల్లో)

పంటలు	అంచనా	ప్రస్తుత సాగు
పత్తి	1.70	1.36 లక్షలు
వరి	1.90	1.72 లక్షలు
కందులు	10 వేలు	3,500
ఇతర పంటలు	5 వేలు	12,163



పంటల సాగుపై రైతుకు అవగాహన కల్పిస్తున్న డీఏఓ

సాగు కష్టమే..



ఈ ఫొటోలోని మహిళా రైతుపేరు జూలుకుంట్ల హైమావతి. స్టేషన్‌ఘనపూర్‌ మండలం రంగరాయిగూడెంకు చెందిన ఈమెకు ఆరున్నర ఎకరాల భూమి ఉండగా.. ఈసారి మూడున్నర ఎకరాల్లో వరి, మూడెకరాల్లో పత్తి సాగు చేస్తున్నది. గత సీజన్‌లో నష్టపోయిన పంటలకు పరిహారం అందలేదు. 'రైతుబంధు' సాయం కూడా జమ కాలేదు. పెట్టుబడి కోసం అప్పులు చేసింది. రూ.2లక్షలకు పైగా బ్యాంకులో రుణం ఉండగా ప్రభుత్వం రూ.లక్ష వరకే మాఫీ చేస్తామని ప్రకటించడంతో మిగతా రూ.లక్ష ఎలా తీర్చాలనే ఆలోచనలో పడింది. వందశాతం మాఫీ చేసి ఆదుకోవాలని హైమావతి వేడుకుంది.

అధికారులు సూచనలు పాటించాలి



వానాకాలం సీజన్‌లో పత్తి, మొక్కజొన్న సాగు సమయం ముగిసింది. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. ఆర్‌ఎన్‌ఆర్‌(120 రోజుల పంట)15048 రకం వరి వెదజల్లే పద్ధతిలో సెప్టెంబర్‌ మొదటి వారం వరకు అవకాశం ఉంది. అంచనా మేరకు వరి సాగుకాలేదు. మరో 13 రోజుల వ్యవధిలో కొంత పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం పత్తి కాండం బలంగా ఉండేలా రైతులు దృష్టి సారించాలి. తేలిక పాటి నేలల్లో 20 గ్రాముల యూరియా లీటరు నీటిలో కలిసి ఆకులపై వారానికి ఒకసారి పిచికారీ చేయాలి. లేదా 19.19.9 లిక్విడ్‌ ఎకరాకు కిలో లేదా 13.0.45 పౌడర్‌ ఎకరానికి కిలో నీటిలో కలిపి ఆకులపై పిచికారీ చేస్తే మొక్కను చీడపీడల నుంచి రక్షించే అవకాశం ఉంటుంది. వీటిని వారినికి ఒకసారి మాత్రమే పిచికారీ చేయాలి.

– వినోద్‌కుమార్‌, డీఏఓ

అమ్మవారికి తామర పూలతో అర్చన



జనగామ: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌ ఏరియా ఉప్పలమ్మ ఆలయంలో నిజ శ్రావణ మాసం రెండో ఆదివారం ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని అమ్మవారిని తామర పూలతో అలంకరించారు. ఉప్పలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఓరుగంటి ఆంజనేయులు, శ్రీనివాస్‌, దామోదర్‌, కౌన్సిలర్‌ మహంకాళి హరిశ్చంద్రగుప్త, రవి, వీరారెడ్డి, లింగయ్య, మహేష్‌, శోభ, సుగుణ, రేణుక రాధిక, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటునమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ

బచ్చన్నపేట: 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీఓ మురళీకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల ఓటు నమోదు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నాటికి అర్హత కలిగిన వారందరూ ఓటు నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రతి గ్రామంలో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని వారి వద్ద అవసరమున్న సర్టిఫికెట్‌లను అందించి ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో ఓటరు నమోదు స్పెషల్‌ డ్రైవ్‌ కొనసాగుతుందని, ఆయా గ్రామాల యువత దీనిని వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ విశాలక్ష్మి, ఆర్‌ఐలు భగత్‌రెడ్డి, ఆంద్రయ్య, ఆయా గ్రామాల బీఎల్‌ఓలు, పలువురు పాల్గొన్నారు.

సేవలో ఆర్యవైశ్యులు ముందుంటారు



ఉత్తర్వులను అందజేస్తున్న ఎమ్మెల్యే తదితరులు



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న మంత్రి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

జనగామ: ఆర్యవైశ్యులు సంపాదనతోపాటు సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటారని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో నిర్వహించిన ఐవీఎఫ్‌ నూతన కార్యవర్గ జిల్లా శాఖ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. నిరుపేదలుగా ఉన్న ఆర్య వైశ్యులతోపాటు, సమాజంలోని ఇతర పేదలను కూడా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో వ్యాపారాలకే పరిమితమైన ఆర్య వైశ్యులు ప్రస్తుతం సామాజిక సేవ, రాజకీయ రంగాల్లోనూ రాణిస్తున్నారని అన్నారు. నూతన కార్యవర్గానికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిరుపేద ఆర్యవైశ్యులకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి మాట్లాడుతూ.. ఆర్య వైశ్య కార్పొరేషన్‌ ఏర్పాటు కోసం కేసీఆర్‌ దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం ఇంటర్నేషనల్‌ ఐవీఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు, టూరిజం డెవలప్‌మెంట్‌ మాజీ చైర్మన్‌ ఉప్పల శ్రీనివాస్‌ గుప్తా మాట్లాడుతూ.. జీఎస్‌టీ, ఇన్‌కం ట్యాక్స్‌ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్యవైశ్యులు ఏటా కోట్ల రూపాయలు చెల్లిస్తున్నారని తెలిపారు.

ప్రమాణ స్వీకారం

ఐవీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు బిజ్జాల నవీన్‌ గుప్త, ప్రధాన కార్యదర్శి శర్విరాల ఉపేందర్‌, కోశాధికారి రాపాక విజయ్‌, కార్యవర్గ సభ్యులచే ఉప్పల శ్రీనివాస్‌తో కలిసి ఐవీఎఫ్‌ రాష్ట్ర దార్మిక పరిషత్‌ చైర్మన్‌ డాక్టర్‌ వంగపల్లి అంజయ్య స్వామి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో చాంబర్‌ అధ్యక్ష, గౌర అధ్యక్షులు పోకల లింగయ్య, పజ్జూరి గోపయ్య, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పోకల జమున, గోపయ్య, వెంకన్న, వేణు, సముద్రాల సందీప్‌, చంద్రశేఖర్‌, రమేష్‌, శ్రీనివాస్‌, కౌన్సిలర్లు మహంకాళి హరిశ్చంద్రగుప్త, నారాయణ పాల్గొన్నారు.

ప్రతి పల్లెకు సుపరిచితుడినే..

- జనగామను పరాయి పాలన నుంచి రక్షించండి
- బీసీ నేతగా, ప్రజలకు దగ్గరగా ఉన్న తనకు టికెట్‌ ఇవ్వండి
- ఆప్కో మాజీ చైర్మన్‌, బీఆర్‌ఎస్‌ నాయకుడు 'మండల'

జనగామ: నియోజకవర్గంలోని ప్రతి పల్లెకు సుపరిచితుడినే.. బీసీ నేతగా అందరి ఆదరణ ఉంది.. ఈసారి జనగామ బీఆర్‌ఎస్‌ టికెట్‌ ఇస్తే.. భారీ మెజార్టీతో గెలుపొంది కానుకగా ఇస్తానని ఆప్కో మాజీ చైర్మన్‌, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు మండల శ్రీరాములు అన్నారు. జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్కు వాస్తుగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భారీ ర్యాలీ మధ్య సూర్యాపేట రోడ్డులోని ఎస్‌ఎంఆర్‌ గార్డెన్‌కు చేరుకున్నారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జనగామలో కడుపు ఖాళీ ఉన్నాము.. రాజకీయాల్లో అవకాశాలు రాక ఇబ్బందులు పడుతున్నాం.. వలస నేతలు ఇటు వైపు చూడొద్దని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌ రావు పెద్ద మనసు చేసుకుని బీసీ సామాజిక వర్గంలో ప్రజాబలం ఉన్న తనకు టికెట్‌ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతానికి ఏ మాత్రం సంబంధం లేని వ్యక్తులు జనగామలో ప్రవేశించి పార్టీలో గందర గోళాన్ని సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం టికెట్లు ఆశిస్తున్న పల్లా రాజేశ్వరెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్సీగా కొనసాగుతుండగానే.. ఎమ్మెల్యే కోసం ఎందుకు ప్రయత్నం చేస్తున్నారని ప్రశ్నించారు. జనగామ బీఆర్‌ఎస్‌ టికెట్‌ ఆశిస్తున్న నేతలు.. దమ్ముంటే సొంత నియోజకవర్గాల్లో పోటీ చేయాలని సవాల్‌ విసిరారు. సీఎం కేసీఆర్‌, మంత్రి కేటీఆర్‌ తన అభ్యర్థిత్వాన్ని ప్రకటిస్తారనే నమ్మకం ఉందని, ఇందుకు నియోజకవర్గంలో ఎటువంటి సర్వేలైనా చేయించవచ్చన్నారు. కేసీఆర్‌ మూడోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలని దేవున్ని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకన్న, రాందయాకర్‌, పర్శరాములు, వజ్జ పర్శరాములు, జీవరత్నం, నర్సింహులు, రచ్చ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాములుకు స్వాగతం పలుకుతూ భారీ ర్యాలీ (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న శ్రీరాములు

బీజేపీ, కాంగ్రెస్‌ నాయకులను తిరగనివ్వం

- జెడ్పీ చైర్మన్‌ పాగాల

జనగామ: సీఎం కేసీఆర్‌పై బీజేపీ, కాంగ్రెస్‌ పార్టీలు విషం చిమ్మడం మానుకోవాలని, విమర్శలు ఆపకుంటే ఆయా పార్టీ నేతను ఊర్లలో తిరగనివ్వమని జిల్లా పరిషత్‌ చైర్మన్‌, బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి అన్నారు. జనగామ మండలం యశ్వంతాపూర్‌ బీఆర్‌ఎస్‌ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌ అమలు చేస్తున్న పథకాలతో ప్రజలకు మేలు చేకూరుతుందని అన్నారు. సీఎంను బొందపెడతారా.. అంటూ ఈటల రాజేందర్‌పై మండిపడ్డారు. తెలంగాణ అమలు చేస్తున్న స్కీంలు బీజేపీ, కాంగ్రెస్‌ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారో ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. అధికారంలోకి రావాలంటే మొదటగా ప్రజల మనసు గెలుచుకోవాలే తప్ప, కేసీఆర్‌పై బూతులు మాట్లాడితే రాదన్నారు. ప్రజల కోసం పని చేస్తున్న ప్రభుత్వానికే మూడోసారి పట్టం కట్టేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్‌లో కేసీఆర్‌ నిర్ణయాలకు తామంత కట్టుబడి ఉన్నామన్నారు. సమావేశంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పోకల జమున, పీఏసీఎస్‌ చైర్మన్‌ నిమతి మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌ రెడ్డి, బద్దిపడగ కృష్ణారెడ్డి, బండ యాదగిరిరెడ్డి, కొండం మధుసూధన్‌రెడ్డి, రాంమ్మోహన్‌ రెడ్డి, కౌన్సిలర్లు బండ పద్మ, పగిడిపాటి సుధ, పేర్ని స్వరూప, రమేష్‌, బండా వెంకటేశం, ప్రవీణ్‌, సలీం ఉన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్‌ సంపత్‌రెడ్డి

పర్యాటకుల సందడి

వాజేడు: మండల పరిధిలోని చీకుపల్లి గ్రామ సమీపంలో ఉన్న బొగత జలపాతానికి పర్యాటకులు పోటెత్తారు. ఆదివారం బొగతకు భారీ సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. జాలు వారుతున్న బొగత అందాలు చూసి తరించారు. నీటి కొలనులో స్నానాలు చేసి సెల్ఫీలు, ఫొటోలు దిగారు.



బొగత జలపాతం చూస్తున్న పర్యాటకులు

63ఏళ్ల వయసులో స్నేహితులతో..

నిడిగొండలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రఘునాథపల్లి: వారంతా దశాబ్దాల క్రితం కలిసి ఒకే పాఠశాలలో చదువుకున్నారు. పదో తరగతి పూర్తయ్యాక వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అలా 1974–75విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసి వెళ్లిన మండలంలోని నిడిగొండ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకే చోట కలుసుకున్నారు. 24 మంది బాల్యస్నేహితులు నాడు చదువుకున్న పాఠశాల ఆవరణకు చేరుకుని ఒకరినొకరు పలకరించుకొని నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఆప్యాయ పలకరింపులు, కరచాలనాలు, అలింగనాలతో పట్టరాని ఆనందంతో గడిపారు. తమను విద్యా విద్యావంతులుగా తీర్చిదిద్ది ఎదుగుదలకు కారకులైన గురువులు వెంకటరామనర్సయ్య, రమేష్‌, అమృతారెడ్డిలను సన్మానించారు. పూర్వ విద్యార్థులు రామకృష్ణారెడ్డి, లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి, విజయ్‌సింగ్‌, చిరంజీవులు, నర్సయ్య, నిరంజన్‌, సుధీర్‌రెడ్డి, నిరంజన్‌, యాదగిరి, మనోహర్‌, అరుణ, సోమయ్య, సింహాద్రి, వెంకటేశ్వర్లు, విద్యాసాగర్‌ పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులతో నాటి ఉపాధ్యాయులు

ఎమ్మెల్యే రాజయ్యకు టికెట్‌ ఇవ్వాలి

- ర్యాలీ నిర్వహించిన దళితులు

జఫర్‌గఢ్‌: స్థానిక ఎమ్మెల్యే డాక్టర్‌ తాటికొండ రాజయ్యకు బీఆర్‌ఎస్‌ పార్టీ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్‌ ఎమ్మెల్యే టికెట్‌ ఇవ్వాలని కోరుతూ ఎంపీపీ రడపాక సుదర్శన్‌ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో దళితులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక రామాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీ సెంటర్‌ మీదుగా బీఆర్‌ఎస్‌ అంబేడ్కర్‌ విగ్రహం వరకు నిర్వహించారు. కడియం శ్రీహరి వద్దు.. రాజయ్య ముద్దు.. అంటూ నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్‌ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుదర్శన్‌ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 70 లక్షలకు పైగా ఉన్న మాదిగలకు ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే రాజయ్యకు టికెట్‌ ఇవ్వకుండా ఎస్సీ ఉపకులానికి చెందిన కడియం శ్రీహరికి టికెట్‌ కేటాయించడం మాదిగలను అవమానపర్చడమేనన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ తాటికాయల బాబు, గబ్బెట రాజయ్య, గుడ్డేటి స్వామి, రడపాక భాస్కర్‌, పులి అశోక్‌, తదితరులు పాల్గొన్నారు.

దళిత నాయకుల ఆందోళన

రఘునాథపల్లి: అనునిత్యం ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకునే ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యకే బీఆర్‌ఎస్‌ టికెట్‌ ఇవ్వాలనే డిమాండ్‌తో మండలంలోని పలు గ్రామాల దళిత నాయకులు ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్‌ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. కడియం వద్దు.. రాజయ్య ముద్దు అంటూ నినాదాలు చేశారు. జాతీయ రహదారిపై బస్టాండ్‌ నుంచి ఖిలాషాపూర్‌ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్‌ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.



జఫర్‌గఢ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దళితులు

జనగామ మెడికల్‌ కళాశాలలో 63 మంది చేరిక

జనగామ: జనగామ మెడికల్‌ కళాశాలలో ఎంబీబీఎస్‌ మొదటి సంవత్సరంలో 63 మంది విద్యార్థులు రిపోర్టు చేశారు. ఇందుకు సంబంధించి మెడికల్‌ కళాశాల ప్రిన్సిపాల్‌, ప్రొఫెసర్‌ డాక్టర్‌ గోపాల్‌రావు ఆధ్వర్యంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ పూర్తి చేశారు. స్టేట్‌ కోటాకు సంబంధించి మొదటి విడతలో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి కాగా, సెంట్రల్‌ కోటాలో నేటి(సోమవారం)తో ముగియనుంది. ఇందులో సెంట్రల్‌ కోటాలో 14 సీట్లు ఉండగా.. కేవలం ఏడుగురు మాత్రమే జాయిన్‌ కాగా, 86 స్టేట్‌ కోటా సీట్లలో 56 మంది రిపోర్టు చేశారు. ఇంకా 37 సీట్లు ఖాళీగా ఉన్నాయి. సెప్టెంబర్‌ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్టేట్‌ కోటాలో విద్యార్థులకు మరింత అవకాశం ఇస్తారా లేదా అనేది వేచి చూస్తున్నామని మెడికల్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ గోపాల్‌రావు తెలిపారు. విద్యార్థులకు ఆయన జాయినింగ్‌ రిపోర్టు ఇచ్చారు. ఆయన వెంట డాక్టర్లు శంకర్‌, అన్వర్‌ తదితరులు ఉన్నారు.



విద్యార్థులను స్వాగతిస్తున్న గోపాల్‌రావు

క్లుప్తంగా

జనగామ టికెట్ గౌడ కులస్తులకే ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిర్ర రాజు

జనగామ రూరల్: రాబోయే ఎన్నికల్లో జనగామ నియోజకవర్గంలో అధిక జనాభా ఉన్న గౌడ కులానికి చెందిన నాగపూరి కిరణ్‌కుమార్‌కు ఇవ్వాలని ఉమ్మడి వరంగల్ జిల్లా గౌడ సంఘాల జేఏసీ చైర్మన్ చిర్ర రాజు గౌడ్ ముఖ్యమంత్రిని కోరారు. ఆదివారం పట్టణంలోని వైఎస్ఆర్ భవన్‌లో జిల్లా గోపా అధ్యక్షుడు మేకపోతుల ఆంజనేయులు అధ్యక్షతన గౌడ కులస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిర్ర రాజు మాట్లాడుతూ ఏళ్ల తరబడి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్న కిరణ్‌కుమార్‌కు అధిష్టానం అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలని కోరారు. ఇతరులకు టికెట్ ఇస్తే గౌడ కులస్తులు ఐక్యమై ఓడిస్తామని ఏకగ్రీవంగా నిర్ణయించారు. కార్యక్రమంలో నాయకులు కన్నా పర్శరాములు, తరిగొప్పుల ఎంపీపీ హరిత సుదర్శన్, ఎంపీటీసీలు బాలరాజు, తీగల సిద్దూ, శివశంకర్, బాలకృష్ణ, వేముల లక్ష్మణ్, సిద్దయ్య, యాదగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నెమలి అప్పగింత



నెమలిని ఎస్సైకి అప్పగిస్తున్న పస్తం రాజేందర్, తదితరులు

ఖిలా వరంగల్ : వరంగల్‌లోని శంభునిపేట సమీపంలోని బుడుగ జంగాల కాలనీకి జాతీయ పక్షి నెమలి ఆదివారం మధ్యాహ్నం చేరుకుంది. సామాజిక కార్యకర్త ఎండి ఫసీ ఆధ్వర్యంలో స్థానికులు గంధం రాజేందర్, పస్తం రాజేందర్, శ్రీనివాస్ నెమలిని మిల్స్ కాలనీ ఎస్సై మున్నీరుల్లాకు అప్పగించారు. నెమలిని పోలీసులు హనుమకొండలోని వన విజ్ఞాన కేంద్రంలో అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.

బీఆర్ఎస్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి

● మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



పాలకుర్తి : టీఎస్‌కే తండాలో గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి/పాలకుర్తి టౌన్ : ప్రజలు తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే రాష్ట్రంలో మరింత అభివృద్ధి పనులు జరుగుతాయని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం మంత్రి మండలంలోని అభివృద్ధి పనుల కార్యక్రమంలో భాగంగా హట్యాతండా, భీక్యానాయక్ తండా, పెద్దతండా, పెద్దతండా (కొండాపురం) టీఎస్‌కే తండాల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. పలువురు గిరిజనులతో మంత్రి నృత్యం చేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ 24 గంటలు విద్యుత్ కావాలా లేక మూడు గంటలే కావాలా అనే విషయాన్ని ప్రజలు తేల్చుకోవాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో రూ. 20 లక్షల వ్యయంతో కేటాయించిన అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముస్కు రాంబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మదార్, సహకార సొసైటీ చైర్మన్ అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి మండలంలోని పలు గ్రామాల నుంచి ఆదివారం వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు మెరుగు వెంకటయ్య ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

బీఆర్ఎస్ విజయానికి తోడ్పాటు అందించండి

దేవరుప్పుల : ప్రత్యేక రాష్ట్ర తరహాలో దేశ సమగ్రాభివృద్ధి కోసం కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చేందుకు బీఆర్ఎస్ అఖండ విజయానికి పాత, కొత్త క్యాడర్ తేడా లేకుండా తోడ్పాటు అందించాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచించారు. ఆదివారం చిన్నమడూరులో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ మేడ సునిత సోమనర్సయ్య స్వగృహంలో ఓ కార్యక్రమానికి హాజరైన అనంతరం సింగరాజుపల్లిలో కాంగ్రెస్ నాయకులు భూమండ్ల వెంకన్న, ఐలయ్య, కర్రె స్వామి, జోగు భద్రయ్య, మహేందర్, పరశురాములు, కత్తుల సందీప్ తదితరులు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్, మండల సమన్వయకర్తలు పల్లె సుందర్‌రామిరెడ్డి, బస్వ మల్లేశం, వైస్ ఎంపీపీ కత్తుల విజయ్, సర్పంచ్ మల్లేషం, మేకపోతుల నర్సింహులు, సోమిరెడ్డి పాల్గొన్నారు.

దిల్ ఖుష్‌గా మంత్రి..

మండల కేంద్రంలో టీ పాయింట్ వద్ద పిచ్చపాటిగా మాట్లాడుతూ మంత్రి దిల్‌ఖుష్‌గా కనిపించారు. కామారెడ్డిగూడేనికి చెందిన మహేందర్ కార్యకర్త రేబాన్ అద్దాలతో కనిపించగా కళ్లకలకలా.. సోకద్దలా..? అంటూ తన పీఏలతో బ్లాక్ అద్దాలు తెప్పించుకొని తాను పెట్టుకొని బాగున్నాయంటూనే టీ తాగి వెళ్లిపోయారు.

దిగివస్తున్న కూరగాయల ధరలు

● లోకల్ పంట వస్తే మరింత ఉపశమనం



వరంగల్: తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పంటలు దెబ్బతిని ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు దిగివస్తున్నాయి. వరంగల్ లక్ష్మీపురం మార్కెట్‌కు టమాట అనంతపురం జిల్లా మదనపల్లి, కర్ణాటక భాగ్యపల్లి ప్రాంతాల నుంచి, మిర్చి కర్నూలు జిల్లా పత్తికొండ నుంచి వస్తుంది. క్యారెట్, బీన్స్, క్యాప్సికం, బీర్‌రూట్, క్యాలీఫ్లవర్, క్యాబేజీ బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు.. అక్కడి నుంచి ఇక్కడికి కమీషన్ వ్యాపారులు పంపిస్తారు. జూలై మొదటి వారంలో క్వింటా రూ.3వేల నుంచి రూ.4వేలు ఉన్న టమాట ఈనెల ప్రారంభం నుంచి పెరిగి.. నాలుగో తేదీన క్వింటా టమాట, పచ్చిమిర్చి ధర రూ.10వేల వరకు చేరింది. మిగిలిన కూరగాయల ధరలు సైతం పెరిగాయి. టమాట ధర ఇలా ఆకాశాన్నంటడం ఇప్పటి వరకు చూడలేదని పలువురు మార్కెట్ వ్యాపారులు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు లేక పోవడం, కొత్తగా వేసిన పంట చేతికి వస్తుండడతో కూరగాయల ధరలు తగ్గు ముఖం పట్టాయి. ప్రస్తుతం కిలో టమాట రూ.15-రూ.30, పచ్చిమిర్చి రూ.50, బెండకాయ రూ.20-రూ.30, వంకాయ రూ.15-రూ.20, చిక్కుడుకాయ(పలక) రూ.30-రూ.40, గోరుచిక్కుడు రూ.20-రూ.40, బీన్స్ రూ.60-రూ.80, క్యారెట్ రూ.50-రూ.60, క్యాలీఫ్లవర్ రూ.30-రూ.40, క్యాబేజ్ రూ.15-రూ.20లకు విక్రయిస్తున్నారు.

బీజేపీలో డాక్టర్ కాళీప్రసాద్ చేరిక



అమిత్ షా సమక్షంలో బీజేపీలో చేరుతున్న డాక్టర్ కాళీప్రసాద్

ఎంజీఎం: వరంగల్ నగరానికి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు, గార్డియన్ ఆస్పత్రి అధినేత డాక్టర్ కాళీప్రసాద్ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సమక్షంలో బీజేపీలో చేరారు. ఖమ్మంలో ఆదివారం జరిగిన 'రైతు-గోస బీజేపీ భరోసా' బహిరంగ సభకు ఐదు వేల మంది కార్యకర్తలు, వివిధ పార్టీల నాయకులతో కలిసి తరలివెళ్లిన డాక్టర్ కాళీప్రసాద్ కాషాయ కండువా కప్పుకున్నారు. ఆయన చేరికతో పరకాల బీజేపీలో నూతనోత్తేజం నిండిందని సీనియర్ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అంతర్జాతీయ కబడ్డీ పోటీల్లో ప్రతిభ



కప్ గెలుచుకున్న టీం సభ్యులతో గణేష్

రాణించిన మన్‌సాన్‌పల్లి విద్యార్థి గణేష్
అభినందించిన కళాశాల యాజమాన్యం

బచ్చన్నపేట: ఇండో నేపాల్ అంతర్జాతీయ కబడ్డీ పోటీల్లో జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం మన్‌సాన్‌పల్లికి చెందిన పంజాల గణేష్ ప్రతిభను కనబర్చాడు. ఈ పోటీల్లో తెలంగాణ నుంచి ఇద్దరు, వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. జనగామ ఏబీవీ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న గణేష్ అండర్-17 విభాగం పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి గతంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాడు. గణేష్ తల్లి పంజాల తార సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. చిన్నప్పటి నుంచే గణేష్‌కు కబడ్డీ అంటే ఎంతో మక్కువ అని తల్లి తార వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం గణేష్‌ను అభినందించింది.

నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్ ప్రారంభం



రుద్రాక్షలను పరిశీలిస్తున్న ఉపేంద్ర శర్మ

హన్మకొండ : హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్‌ను తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్ర శర్మ ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం ఉపేంద్ర శర్మ మాట్లాడారు. శ్రావణ మాసంలో రుద్రాక్షలు ధరిస్తే ఆరోగ్యం, ఐశ్వర్యం, మానసిక ప్రశాంతత లభిస్తాయని చెప్పారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రుద్రాక్షలు ధరిస్తే సత్ఫలితాలు లభిస్తాయని తెలిపారు. ఏకముఖి నుంచి 21 ముఖాల రుద్రాక్షలు, స్ఫటిక తులసి, నవరత్న మాలలు, పంచముఖి రుద్రాక్ష మాలలు, సాలీగ్రాములు, మర్కట శివలింగాలు. దైవికమైన వస్తువులు ఎగ్జిబిషన్‌లో ఉన్నాయని వివరించారు. సెప్టెంబర్ 4 వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని చెప్పారు.

వెయ్యేళ్ల నాటి వరదపాశం బండ

● వెల్డి పాండవుల గుట్టపై గుర్తించిన చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి



వెల్దిలో వరద పాశం బండను పరిశీలిస్తున్న రెడ్డి రత్నాకర్‌రెడ్డి

రఘునాథపల్లి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామంలోని పాండవుల గుట్టపై దాదాపు వెయ్యేళ్ల నాటి వరద పాశం బండను చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి ఆదివారం వెలుగులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వెయ్యేళ్ల క్రితం శిలాయుగంలో ఆదిమానవుల జీవన విధానం, అప్పటి ఉత్సవాలకు గుర్తు ఈ వరదపాశం బండ అని తెలిపారు. నాడు పాయసం ఒక్కో చోట ఉండేలా వందకు పైగా తొలచిన చిన్న బద్దులు ఉన్నాయని, ఈ బండపై వరద పాశం పండుగ పూర్వకాలం నుంచి నేటికీ కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని నాటి నుంచి పూర్వీకుల మాదిరిగా ఈ గుట్టపై ముదిరాజ్ కులస్తులు ఏటా మూడు ఆదివారాలు వరద పాశం పండుగ జరుపుకుంటున్నారని చెప్పారు. క్రీస్తు పూర్వం ఐదువేల యేళ్ల క్రితం నవీన శిలాయుగం, రెండు వేల యేళ్ల కిందటి బృహత్ శిలాయుగం మొదలుకొని, ఒకటవ శతాబ్దం నుంచి నేటి వరకు పాండవుల గుట్ట కేంద్రంగా మానవ జీవితం కొనసాగుతున్నదని వివరించారు.

పోగొట్టుకున్న బ్యాగు, బంగారు ఆభరణాల అప్పగింత



బ్యాగును మహిళకు అప్పగిస్తున్న ఏసీపీ భోజరాజు

వరంగల్ క్రైం : ఓ మహిళలు బ్యాగుతోపాటు 20 తులాల బంగారు ఆభరణాలు పోగొట్టుకోగా పోలీసులు కొన్ని నిమిషాల వ్యవధిలోనే గుర్తించి ఆమెకు అప్పగించారు. ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు కథనం ప్రకారం.. వరంగల్ కాశిబుగ్గ సమీపంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన కందకట్ల జ్యోత్స్న శనివారం రాత్రి 20 తులాల బంగారు ఆభరణాలకు మెరుగు పెట్టించుకుని వరంగల్ చౌరస్తా బట్టల బజార్ నుంచి కాశిబుగ్గకు ఆటోలో చేరుకుంది. ఈ క్రమంలో ఆమె ఆటోలో తన బ్యాగు మర్చిపోయి ఇంటికి వెళ్లింది. అనంతరం బ్యాగు, అందులో 20 తులాల బంగారు ఆభరణాలున్న విషయం గుర్తుకొచ్చి వెంటనే కాశిబుగ్గ చౌరస్తాకు చేరుకుని అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ హోంగార్డు రవికి సమాచారం ఇచ్చింది. ఆయన మ్యాన్‌ప్యాక్ ద్వారా ఇన్‌స్పెక్టర్ వెంకన్నకు, సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో పోలీసులు అన్ని ఆటో స్టాండ్లు, యూనియన్లకు సమాచారం అందించారు. అదే సమయంలో ఆటో డ్రైవర్ బ్యాగ్‌ను గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం బాధిత మహిళను ఏసీపీ భోజరాజు పిలిపించి బ్యాగ్ అప్పగించారు. అనతికాలంలోనే తన బ్యాగును అప్పగించారంటూ పోలీసులకు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వెంకన్న, ఎస్సై శ్రవణ్‌కుమార్, హోంగార్డు రవి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి



రఘురాం (ఫైల్)

పరకాల : విద్యుద్ఘాతానికి గురై ఇంటర్ విద్యార్థి మృతి చెందిన ఘటన పట్టణ పరిధిలోని సీతారాంపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సీతారాంపూర్‌కు చెందిన బస్వాజు మహేందర్ కొడుకు రఘురాం (17) ఇంటర్ చదువుతున్నాడు. ఇంటి నిర్మాణం కోసం తవ్విన పిల్లర్ గుంతలోకి శనివారం కురిసిన వర్షానికి చేరిన నీటిని మోటర్ సాయంతో బయటకు తీస్తుండగా మోటర్‌ను పక్కకు జరిపిన రఘురాం విద్యుద్ఘాతానికి గురై కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు విద్యుత్ సరఫరా నిలిపేసి రఘురాంను పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. రఘురాం మృతితో సీతారాంపూర్‌లో విషాదం నెలకొంది. మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరత్నం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



సురేష్ (ఫైల్)

వాజేడు : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని జగన్నాథపురం జంక్షన్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని మండపాక గ్రామానికి చెందిన చిచ్చెడి సురేష్ (35) కాలినడకన స్వగ్రామానికి వెళ్తుండగా వెంకటపురం (కె) వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.

మొగుళ్లపల్లిలో పల్సర్ ఢీకొని..



రమేష్ (ఫైల్)

మొగుళ్లపల్లి : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జమ్మికుంట మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కల్లెపల్లి రమేష్ (38) ఆదివారం ఉదయం బైక్‌పై చిట్యాల మండలంలోని కోటంచ ఆలయానికి వెళ్లి వస్తుండగా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని ఎంజేపీ స్కూల్ ఎదుట వేములపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ అబ్దుల్ హఫీజ్ మరో పల్సర్ వాహనంపై వేగంగా వస్తూ అజాగ్రత్తగా నడుపుతూ రమేష్ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రమేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించగా మధ్యలోనే పరిస్థితి విషమించి రమేష్ మృతి చెందాడు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు..



సారయ్య (ఫైల్)

శాయంపేట : మండలంలోని జోగంపల్లి గ్రామానికి చెందిన రాపర్తి సారయ్య (75) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం.. సారయ్య ఎడమ కాలు ఇన్ఫెక్షన్‌కు గురి కాగా వైద్యులు శస్త్రచికిత్స చేసి ఒక వేలు తొలగించారు. మందులు వాడినా కాలు నొప్పి తగ్గకపోవడంతో సారయ్యను అతడి కొడుకు భిక్షపతి మళ్లీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. కాగా కాలు తీసేస్తారే ఆందోళనతో సారయ్య శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కొడుకు భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వాగులో మునిగి..



వాజేడు : వాగు వద్ద జానకయ్య మృతదేహం

వాజేడు : వాగులో మునిగి వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని కృష్ణాపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, కృష్ణాపురం సర్పంచ్ కథనం ప్రకారం.. కృష్ణాపురం గ్రామానికి చెందిన మడె జానకయ్య (60) చేపలు పట్టేందుకు మోడికుంట వాగుకు శనివారం సాయంత్రం వెళ్లాడు. వాగులో వల పెడుతుండగా ప్రమాదవశాత్తు వల కాళ్లకు, చేతులకు చుట్టుకుంది. దీంతో జానకయ్య ప్రమాదవశాత్తు అదుపుతప్పి లోతుగా ఉన్న గుంతలో పడి మునిగిపోయాడు. వల అడ్డం పడటంతో బయటకు రాలేక చనిపోయాడు. జానకయ్య ఇంటికి రాకపోవడంతో కొడుకులు, గ్రామస్తులు వెళ్లి చూడగా ఒడ్డుపైన జానకయ్య పంచె కనిపించింది. అనుమానంతో వాగులో గాలించగా ఆదివారం ఉదయం మృతదేహం లభించింది. పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య నలుగురు పిల్లలున్నారు.

బీసీలకు సీట్లు ఇవ్వకుంటే రాజకీయ సమాధి చేస్తాం

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బైరి రవికృష్ణ

జనగామ రూరల్: రాష్ట్ర జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు సరైన విధంగా సీట్లు ఇవ్వకుంటే పార్టీలను రాజకీయ సమాధి చేస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో జిల్లా అధ్యక్షుడు దూడల సిద్ధయ్య అధ్యక్షతన నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశానికి రవికృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 60 శాతం ఉన్న బీసీలకు 23 సీట్లు బీఆర్ఎస్ పార్టీ కేటాయించడం 5 శాతంగా ఉన్న రెడ్డిలకు 40 సీట్లు, ఆరు శాతం ఉన్న వెలమలకు 11 సీట్లు ఇవ్వడం దారుణమన్నారు. కాంగ్రెస్, బీజేపీలు జనాభా ప్రాతిపదికన బీసీలకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో సెప్టెంబర్ 10 తలపెట్టిన బీసీ సింహగర్జనను విజయవంతం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఎదునూరి రాజమౌళి, ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకుడు రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సిద్ధు, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్‌లే టార్గెట్!

ఏసీబీ కేసు నుంచి తప్పిస్తామంటూ టోకరా
● అనుమానం వచ్చి అధికారులను ఆశ్రయించిన బాధితులు
● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
● నిందితుడి అరెస్టుకు రంగం సిద్ధం

నల్లబెల్లి : సైబర్ నేరస్తులు కొత్త కొత్త రీతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. నిరుద్యోగులకు జాబ్స్ పేరిట.. లంచాలు తీసుకున్న వారిని ఏసీబీ కేసు నుంచి తప్పిస్తామంటూ టోకరా వేస్తున్నారు. తాజాగా ఇలాంటి మోసానికి ఓ వ్యక్తి పాల్పడగా పోలీసులు సదరు వ్యక్తిని అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఏసీబీ అధికారిగా పరిచయం చేసుకుంటూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లోని సర్వేయర్‌గా పని చేస్తున్న కొందరు ఉద్యోగులను మోసం చేస్తూ డబ్బులు దండుకుంటున్నాడు.

మోసానికి పాల్పడుతున్న తీరు ఇలా..

కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి తహసీల్దార్ కార్యాలయాల్లో పని చేస్తున్న సర్వేయర్లతో తనకు తాను ఏసీబీ అధికారినని పరిచయం చేసుకున్నాడు. మీరు లంచాలు తీసుకున్నారని చెప్పి డబ్బులు డిమాండ్ చేశాడు. ఈ విషయం ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఐకేపీ సర్వేయర్‌గా పని చేస్తున్న మల్లయ్యకు ఈ నెల 16న ఓ వ్యక్తి ఫోన్ చేసి తనకు తాను ఏసీబీ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. 'నువ్వు లంచం తీసున్న ఆధారాలు మా దగ్గర ఉన్నాయి. ఈ కేసు నుంచి నిన్ను తప్పించేందుకు లక్ష రూపాయలు ఇవ్వాలి' అని డిమాండ్ చేశాడు. ఇవ్వకపోతే కేసు నమోదు చేస్తామని బెదిరించాడు. అదే రోజు పర్వతగిరి మండలంలో పని చేస్తున్న సర్వేయర్ శ్యామూల్‌కు అదే వ్యక్తి ఫోన్ చేసి ఏసీబీ కేసు నుంచి తప్పించేందుకు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేకపోతే కేసు నమోదు చేస్తామని ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడ్డాడు. అలాగే నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాల్లోని సర్వేయర్లకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశాడు. ఇంతటితో ఆగకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలోని పలువురు సర్వేయర్లకు ఫోన్లు చేసి ఏసీబీ కేసుల నుంచి మిమ్మలను తప్పించేందుకు డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. ఇందుకోసం గూగుల్‌పే, ఫోన్‌పేలో డబ్బులు పంపాలని డిమాండ్ చేశాడు. సందేహం వచ్చిన సదరు ఉద్యోగులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. నిందితుడితో జరిగిన సంభాషణ, ఫోన్ నంబర్ వివరాలు అందించారు. దీంతో ఏసీబీ అధికారులు ఏసీబీ అధికారుల ముసుగులో సర్వేయర్లను నమ్మించి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాడని గుర్తించారు. సదరు నిందితుడికి డబ్బులు పంపించవద్దని సర్వేయర్లకు స్పష్టం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేసి అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

దడువాయి యూనియన్ పాలకవర్గం రాజీనామా

వరంగల్ : ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ దడువాయి యూనియన్ పాలకవర్గం గడువు తీరిపోవడంతో రాజీనామా చేసినట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మార్త శ్యాంసుందర్, అప్పని కృష్ణ ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నూతన కమిటీ ఎన్నిక కోసం ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. సభ్యులు గమనించాలని కోరారు.